సాక్షి రంగారెడ్డి

మంగళవారం। 3। సెప్టెంబర్। 2024



గుంత.. చింత!

గుంతల రోడ్లు.. తారు లేచిన దారులు.. మట్టితో పూడ్చిన మార్గాలతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు.

8లో▸

జోహార్.. వైఎస్సార్



షాద్‌నగర్: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

న్యూస్‌రీల్

రేపు 'చలో విద్యుత్ సౌధ'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ సంస్థల్లో కండిషన్లతో కల్పిస్తున్న పదోన్నతులపై ప్రభుత్వం వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జి/జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ బీసీ,ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ సంస్థల్లో అన్ని కేడర్లలో నేరుగా నియమించిన ఉద్యోగుల సీనియార్టీ మెరిట్ జాబితా ఆధారంగా సర్వీసు రెగ్యులైజేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఆ సమితి చైర్మన్ కుమారస్వామి, కో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ భాను ప్రకాష్ తెలిపారు.

పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వద్దు



కొత్తగూడలో అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీఓ సురేష్‌మోహన్

కందుకూరు: పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడలో సోమవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్కడక్కడ వర్షం నీరు నిలిచి ఉండటంతో శానిటేషన్ సరిగ్గా చేయడం లేదని గుర్తించారు. ఫాగింగ్ కూడా చేయలేదని, కంపోస్టు యార్డులో తడి, పొడి చెత్త వేరు చేయడం లేదని గమనించి పంచాయతీ కార్యదర్శి ఉమాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాల సీజన్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత ఉన్నారు.

తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయాలు ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆదేశించారు. విద్యుత్ సర్కిల్ కార్యాలయాల సీఈలు, ఎస్ఈలతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వర్షాలతో భారీ వృక్షాలు, ఇతర వస్తువులు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. కూలిపోయిన చెట్లను తొలగించి కొత్త స్తంభాలు, లైన్లు వేయాలని సూచించారు. రెండు రోజులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు.

ఫీవర్.. షివర్

విజృంభిస్తున్న 'సీజనల్' వ్యాధులు



- ఎక్కడ చూసినా జ్వర పీడితులే
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- పడకలు కూడా దొరకని పరిస్థితి
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- ఇంటింటి సర్వేకు ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పల్లెలు, పట్టణాలు విషజ్వరాల గుప్పిట్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. ఏ ఇంట్లోకి తొంగి చూసినా.. ఎవరో ఒకరు జ్వరం.. ఒంటి నొప్పులతో బాధపడే బాధితులే కనిపిస్తున్నారు. ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనే కాదు.. సాధారణ క్లినిక్‌లు సైతం జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. జనరల్ ఫిజిషియన్, పీడియాట్రిక్ విభాగాల్లో పడకలు దొరకని పరిస్థితి నెలకొంది. కొంతమంది వైద్యులు రోగుల్లో ఉన్న బలహీనతను 'క్యాష్' చేసుకుంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు కనీస సమాచారం ఇవ్వకుండానే గుట్టుగా చికిత్సలు చేస్తున్నారు. సాధారణ జ్వరాలను కూడా డెంగీ, చికున్‌గున్యాగా అనుమానించి, వైద్య పరీక్షలు, ఇన్‌పేషంట్ చికిత్సల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో పడకలు ఫుల్

మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉంటోంది. పారిశుద్ధ్య లోపం తలెత్తింది. నీరు, ఆహారం కలుషితమవుతోంది. దీనికి తోడు ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న మార్పులకు తోడు సీజనల్ వ్యాధులపై ప్రజలకు కనీస అవగాహన లేకపోవడం వారి పాలిటశాపంగా మారింది. శరీర ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా 102 నుంచి 103 డిగ్రీల నమోదవడం, కాళ్లు, కీళ్ల నొప్పులతో శరీరాన్ని ఎటూ కదల్చలేని పరిస్థితి. ఇదే సమయంలో చాపకింద నీరులా డెంగీ, చికున్ గున్యా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. వనస్థలిపురం, కొండాపూర్ ఏరియా ఆస్పత్రులతో పాటు మహేశ్వరం, సరూర్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉన్న చోట వైద్యనిపుణులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స కోసం సమీపంలోని ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే రోగులతో ఆయా ఆస్పత్రుల్లోని బెడ్లు పూర్తిగా నిండిపో వడంతో కొత్తగా వచ్చిన వాళ్లకు పడకలు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది.

హెల్త్ క్యాంపులు షురూ

మంచినీటి సంపుల్లోకి వరదనీరు వచ్చి చేరుతుండటం, కాచి, వడపోయకుండా అలాగే తాగేస్తుండటంతో అనేక మంది డయేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారు. వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. వీరిలో చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారు. ఏకధాటి వర్షాలు, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఇప్పటికే ఇంటింటి జ్వర సర్వేను చేపట్టిన జిల్లా వైద్య ఆరో గ్యశాఖ తాజాగా సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సహా కేజీబీవీ హాస్టళ్లలో హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసింది. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, మందులు అందజేశారు.

బొప్పాయి, కివీ పండ్లకు డిమాండ్

జనవరి ఒకటి నుంచి ఆగస్టు 25 వరకు జిల్లాలో 232 కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా వీటి సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉన్నట్లు సమాచారం. చికున్‌గున్యా కేసుల్లో అత్యధికం గ్రేటర్ జిల్లాల్లోనే (61) నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. జ్వరం కారణంగా పడిపోతున్న ప్లేట్‌లెట్స్ కౌంట్‌ను పెంచుకునేందుకు బొప్పాయి, కివీ పండ్లను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ఆయా పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. పదిహేను రోజుల క్రితం వరకు బొప్పాయి కేజీ రూ.30–35 పలకగా, తాజాగా రూ.45–50 వరకు విక్రయిస్తున్నారు. కివీ పండ్ల ధరలు కూడా అదేస్థాయిలో పెరుగుతున్నాయి.

ప్రతీజ్వరం డెంగీకాదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావ్



ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావ్

ఆమనగల్లు: భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున.. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావ్ అన్నారు. అత్యవసర వైద్యం అందించేందుకు జిల్లాలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న ప్రతిజ్వరం డెంగీ కాదని, ప్రజలు ఆందోళన చెందొద్దని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించి వైద్య చికిత్సకోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, నీటిని వేడిచేసి చల్లార్చి తాగాలని ఆయన సూచించారు. అవసరమైన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు చికిత్స నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో జ్వర సర్వే కొనసాగుతోందని, ఎక్కువగా జ్వరాలు వచ్చే గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.గీత, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్, డాక్టర్లు నాగరాజు, మైమునా, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కందుకూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావ్ సూచించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్, ఎస్సీ బాలుర వసతి గృహం, కొత్తగూడలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఆయా విద్యా సంస్థల్లో పారిశుద్ధ్యం విషయమై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు విజృంభించకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించేలా అందరూ చొరవ చూపాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్, ఏఎస్ఎం అర్చన, సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



శంషాబాద్‌లోని కాముని చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలను కలెక్టర్ శశాంక సోమవారం పరిశీలించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌తో పాటు శంషాబాద్ కాముని చెరువు, మణికొండలోని నెక్నాంపూర్ చెరువులను సందర్శించారు. చెరువుల్లోకి వస్తున్న నీరు.. నిల్వలను పరిశీలించారు. ఆయా చెరువులు, కుంటల కింది ఉన్న లోతట్టు ప్రాంతాల్లోనూ పర్యటించారు. కట్ట దిగువన ఉన్న ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు పనుల పరిశీలన

పహాడీషరీఫ్: బాలాపూర్‌లోని బాలాగార్డెన్ నుంచి గుర్రం చెరువు వరకు రూ.1.25 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ శశాంక సోమవారం పరిశీలించారు. బాలాపూర్ గణనాథుడి నిమజ్జన ప్రధాన రూట్ కావడంతో గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వాణిరెడ్డితో కలిసి రాయల్ కాలనీలో పనులను పర్యవేక్షించారు. నిమజ్జనం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్‌ఖాన్ చెరువును పరిశీలించారు. రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఆరు ఇళ్లలోకి నీరు చేరినట్టు తెలుసుకున్న ఆయన ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అద్దెకు ఉంటున్న వారే కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాలని సూచించడంతో అందుకు వారు అంగీకరించారు. మంగళవారం ఈ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట బాలాపూర్ తహసీల్దార్ ఇందిర, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

'పెద్ద ఎత్తున మురికివాడలు ఉన్న జల్‌పల్లిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. మున్సిపల్ పరిధిలోని అన్ని బస్తీల్లో ఎప్పటికప్పుడు టిమోపాస్ మందును పిచికారీ చేయిస్తున్నాం. ఆరు మిషన్ల ద్వారా ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా ప్రజలంతా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంట్లోని నీటిని పారబోసి, కొత్తగా పట్టుకోవాలి. పారిశుద్ధ్యం, విషజ్వరాల నివారణలో స్థానిక కౌన్సిలర్లను కూడా భాగస్వాములను చేస్తున్నాం' అని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు విశేష స్పందన లభించింది. సమస్యలను స్వయంగా నోట్ చేసుకున్న ఆమె పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విష జ్వరాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. – పహాడీషరీఫ్



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

- ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నాం
- కౌన్సిలర్లను భాగస్వాములను చేస్తున్నాం
- సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం
- జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

సాక్షి ఫోన్ ఇన్

ఎర్రకుంటలో చెత్త తరలింపు ఆటోలు రావడం లేదు. స్థానికంగా నాలాకు పైకప్పు లేదు. ఎర్రకుంట చౌరస్తాలో శిథిలమైన రహదారికి మరమ్మతులు చేయడం లేదు. – షర్ఫుద్దీన్ హామెద్, ఎర్రకుంట

కమిషనర్: వర్షాలు తగ్గగానే ఎర్రకుంట రహదారికి మరమ్మతులు చేయిస్తాం. నాలా పైకప్పు విషయమై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఆటోలు కూడా రెండు రోజులకు ఒకసారి వచ్చేలా చూస్తాం.

జల్‌పల్లి గ్రామంలో డంపింగ్ యార్డ్ కారణంగా దోమలు వృద్ధి చెంది గ్రామస్తులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఫాగింగ్ కూడా చేయడం లేదు. – యంజాల శివకుమార్, జల్‌పల్లి

కమిషనర్: ప్రస్తుతం సేకరిస్తున్న చెత్తను కాటేదాన్‌కు తరలిస్తున్నాం. ఫాగింగ్‌పై చర్యలు తీసుకుంటాం.

శ్రీరాం కాలనీలో ఫాగింగ్ సరిగ్గా చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలు ప్రబలుతున్నాయి. చెత్త పాయింట్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. – కాట్రగడ్డ వాసుబాబు, శ్రీరాం కాలనీ

కమిషనర్: సిబ్బందిని పంపించి ఫాగింగ్ చేయించేలా చర్యలు తీసుకుంటాను.

ఉస్మాన్‌నగర్‌లో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. జ్వరాల బారిన పడుతున్నాం. చెత్త ఆటోలు కూడా రావడం లేదు. – సలీం, ఉస్మాన్‌నగర్

కమిషనర్: వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తా.

శ్రీరాం కాలనీలోని భవిష్య పాఠశాల పక్కన రోడ్డుపై నెల రోజుల క్రితం గొయ్యి ఏర్పడింది. ప్రస్తుతం వర్షం, మురుగునీరంతా అందులో చేరడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. – నాగార్జున, శ్రీరాం కాలనీ

కమిషనర్: స్వయంగా పరిశీలించి మట్టితో పూడ్చేలా చూస్తా.

జల్‌పల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట అంధకారం నెలకొంటోంది. మోరీలు పొరుతున్నాయి. స్థానికంగా ఉన్న తాళ్ల కుంట కబ్జాకు గురవుతోంది. – మురళీకృష్ణ, జల్‌పల్లి

కమిషనర్: కబ్జా విషయం ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. నూతన పైప్‌లైన్ ఇప్పటికే మంజూరైంది.

షాహిన్‌నగర్‌లో మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. మ్యాన్‌హోల్‌కు పైకప్పు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల, మసీద్ ఉండడంతో అక్కడికి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉంది. ఫాగింగ్ కూడా చేయడం లేదు. – సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాహిన్‌నగర్

కమిషనర్: వెంటనే సిబ్బందిని పంపి మ్యాన్‌హోల్ పైకప్పు సమస్యను పరిష్కరిస్తాం. ఫాగింగ్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహిస్తాం.

వాదే ముస్తఫా బస్తీలో ఏడు నెలల క్రితం కొత్త రోడ్డు కోసమని తవ్వి వదిలేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. – సయ్యద్ హుస్సేన్, వాదే ముస్తఫా

కమిషనర్: ఏఈతో మాట్లాడి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తా.



వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంసింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంసింగ్

షాద్‌నగర్‌రూరల్: హిందూ సమాజాన్ని కాపాడటంలో విశ్వహిందూ పరిషత్ ముందుంటుందని వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంసింగ్ అన్నారు. వీహెచ్‌పీని స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పరిషత్ నేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాంసింగ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా హిందూ ధర్మంపై ముప్పేట దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతం మార్పిడి మాఫియా నుంచి హిందువులు, హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందువుల అస్తిత్వానికి ముప్పుగా పరిణమిస్తున్న అనేక సమస్యలపై విశ్వహిందూ పరిషత్ నిరంతరం సంఘర్షణ చేస్తోందని తెలిపారు. దేవాలయాల ఆస్తులను కొల్లగొట్టి భూములను కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేష్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు హిందువులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని మండిపడ్డారు. హిందువులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సమాజం మేల్కొని చైతన్యవంతం కావాలన్నారు. అనంతరం వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంసింగ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పగుడాకుల బాలస్వామి, రంగయ్య, బాలబ్రహ్మచారి, నాగిళ్ల ప్రభాకర్, సందీప్, రుషికేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి



కొత్తగూడ కస్తూర్బాగాంధీ పాఠశాలలో తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి తదితరులు

కందుకూరు: వర్షాలతో ఎవరికీ, ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కొత్తగూడ పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వంటగది, కూరగాయలు, మరుగుదొడ్లు, తరగతి గదులు, డార్మెటరీ తనిఖీ చేశారు. అక్కడే వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెడికల్ శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. అధికారులు తరచూ విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మహేశ్వరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ రాజ్, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వర్షం నీరు గుంతల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ ఐసీడీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్ మోహన్, మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ శైలజ, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ, వైద్యాధికారులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

విల్లావిల!



విల్లాల ఎదుట భారీగా నిలిచిన వర్షపు నీరు

మోకిల గ్రామంలోని లా పలోమా గేటెడ్ కమ్యూనిటీ విల్లాల్లోకి భారీగా వర్షం నీరు చేరింది. దీంతో ప్రాంగణమంతా చెరువును తలపిస్తోంది. ఇందులోని మొత్తం 212 విల్లాల్లో సుమారు వెయ్యి మంది నివాసం ఉంటున్నారు. రూ.కోట్లు పెట్టి కొనుక్కున్న విల్లాలో తిరగలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022లోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైనా అధికారులు పట్టించుకోలేదన్నారు. డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి, తహసీల్దార్ సురేందర్, ఎంపీడీఓ వెంకయ్య విల్లాలను పరిశీలించి, జేసీబీల సాయంతో కాల్వలు తీయించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పారు. – శంకర్‌పల్లి



వర్షపు నీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు


గుడ్డుపై ప్రభుత్వం వేసిన స్టాంప్


కుళ్లిపోయిన కోడి గుడ్డు

అంగన్‌వాడీలకు కుళ్లిన కోడిగుడ్లు

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే కోడిగుడ్లు పాడై ఉండటంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండలంలోని ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్ల పల్లి సెంటర్ నుంచి బాలింతలు, గర్భిణులకు సరఫరా చేసిన కోడిగుడ్లు నాసిరకంగా ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. – కందుకూరు

యువతి అదృశ్యంపై కేసు నమోదు


కృష్ణవేణి (ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన బోయిని నర్సింలు కూతురు కృష్ణవేణి(20) గత నెల 31 సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం యువతి అన్న నవీన్ మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ

మాడ్గుల: బైక్ అదుపు తప్పి, చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చల్లపల్లికి చెందిన కొమ్ము అశోక్(35) సోమవారం ఉదయం 7గంటలకు అత్తగారి ఊరైన మాడ్గుల మండలం ఇర్విన్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన చెట్టును ఢీకొని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా అశోక్‌కు.. భార్య సాలమ్మ మధ్య కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులే అశోక్‌ను హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


ఘటనా స్థలంలో బైక్‌తో పడిపోయిన అశోక్

భోజన వితరణ

సాక్షి, సిటీబ్యూరో: దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర రెడ్డి, తన తండ్రి లేబాకు నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా లేబాకు నారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, డా.బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా.ఎల్.విజయ కృష్ణా రెడ్డి (ఎల్వీకే) ఆధ్వర్యంలో ఎస్ఆర్ నగర్‌లోని ఆశ్రయ్ ఆకృతి సంస్థ విద్యార్థులకు భోజనం వితరణ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో ఎల్వీకే మాట్లాడుతూ., తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లేబాకు తేజశ్విని పాల్గొన్నారు.


మొయినాబాద్: పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు


శంకర్‌పల్లి: ఫత్తేపూర్ బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వర్షపు నీరు

గజానికో గుంత.. ప్రయాణానికి చింత!

గ్రామీణ రహదారుల్లో ప్రయాణమంటే ఒళ్లు హూనం కావాల్సిందే. గుంతల రోడ్లు.. తారు లేచిన రహదారులు.. మట్టితో పూడ్చిన మార్గాలు.. ఇవీ జిల్లా వ్యాప్తంగా దర్శనమిస్తున్న కొన్ని రహదారులు. వీటి గుండా ప్రయాణించాలంటే సర్కస్‌లో విన్యాసాలు వేసినట్లుందని వాహనదారులు వాపోతున్నారు. కొన్ని దారుల్లో గజానికో గుంత ఏర్పడి ప్రయాణికులను వేధిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. ఎక్కడ రోడ్డు ఉందో.. ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్


చేవెళ్ల: ఆలూరులో బురదమయంగా మారిన లింక్‌రోడ్డు


చేవెళ్ల: శంకర్‌పల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షపు నీరు


షాబాద్: పోలీస్‌స్టేషన్ రోడ్డు దుస్థితి


కొందుర్గు: బైరంపల్లి వద్ద దెబ్బతిన్న రోడ్డు


ఇబ్రహీంపట్నం: ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం వద్ద..


కడ్తాల్: ఎక్వాయిపల్లి-ముద్విన్ రహదారిపై వాహనదారుల ఇక్కట్లు


కడ్తాల్: కర్కల్‌పహాడ్-చల్లంపల్లి రహదారిపై నిలిచిన నీరు


ఆమనగల్లు: మేడిగడ్డతండా-శంకరకొండతండా రోడ్డు దుస్థితి

ఆర్టీసీ దుకాణాదారులకు ఊరట

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ దుకాణాదారులకు సోమవారం కోర్టులో ఊరట లభించింది. కోవిడ్ సమయంలో వ్యాపార రోజుల నష్టాన్ని భర్తీ చేయడానికి దుకాణాల లైసెన్స్ వ్యవధిని పెంచాలని వ్యాపారులు అధికారులను కోరారు. ఈ విషయమై కొంత కాలంగా అద్దె విషయంలో దుకాణాదారులకు, ఆర్టీసీకి మధ్య వివాదం కొనసాగుతుంది. అయితే ఆర్టీసీ అధికారులు ఇటీవల దుకాణాలను వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. కొంత గడువు ఇవ్వాలని దుకాణాదారులు కోరినా సమయం ఇవ్వకుండా అధికారులు షాపులకు తాళాలు వేశారు. ఈ వ్యవహారంపై వ్యాపారస్తుడు కూచూరి ప్రవీణ్‌తో పాటు పలువురు షాద్‌నగర్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం జడ్జి సూరజ్‌సింగ్ స్టేటస్‌కో విధించారు. దీంతో ఆర్టీసీ దుకాణాదారులకు కోర్టులో కొంత ఊరట లభించింది.

హిమాయత్‌సాగర్‌కు తగ్గిన వరద

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిమాయత్‌సాగర్ జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాలలో వర్షం తగ్గడంతో ఈసీ వాగు గుండా వచ్చే వరద ప్రవాహం తగ్గిపోయింది. సోమవారం సాయంత్రం వరకు జలాశయం నీటి మట్టం 1759.45 అడుగులు కాగా పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు. మరో మూడు అడుగుల మేర వరదనీరు వచ్చిచేరితే హిమాయత్‌సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టంకు చేరుకుంటుంది.


హిమాయత్‌సాగర్ జలాశయంలో నీటి మట్టం

విద్యార్థినుల ఆందోళనతో సర్కారు చర్యలు

కేజీబీవీలో పది మంది ఉపాధ్యాయుల బదిలీ

శంషాబాద్ రూరల్: తమ సమస్యలపై గళం విప్పి జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన కేజీబీవీ విద్యార్థినులకు ఎట్టకేలకు కాస్త ఊరట దొరికింది. మండలంలోని పాల్మాకులలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న 10 మందిని ఒకేసారి బదిలీ చేశారు. వీరిలో బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. పాఠశాల ఎస్ఓ(స్పెషల్ ఆఫీసర్)తో పాటు ఉపాధ్యాయులను వేరే చోట్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరి స్థానంలో కొత్తగా ఉపాధ్యాయులను నియమించారు. మిగతా చోట్ల ఉన్న కేజీబీవీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉపాధ్యాయులను ఇక్కడ నియమంచినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. వంట సిబ్బంది మినహా మిగతవారు బదిలీ కావడంతో ఇకనైనా తమకు ఇబ్బందులు ఉండవని విద్యార్థినులు భావిస్తున్నారు.

మిగతా సమస్యలపరిష్కారమెప్పుడో..

పాఠశాలలో భోజన, వసతి సౌకర్యాలతో పాటు బోధన సరిగా లేదంటూ గత నెల 30న విద్యార్థినులు ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తైయింది. ఇక యూనీఫాం, కాస్మొటిక్ ఛార్జీలు బిల్లులు ఎప్పుడు మంజూరు అవుతాయో చూడాల్సి ఉంది. సురక్షిత తాగునీటి కోసం ఇక్కడ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. బయట నుంచి ఫిల్టర్ నీళ్లు కొనుగోలు చేస్తుండగా.. గత కొంత కాలం నుంచి విద్యార్థులు బోరు నీళ్లు తాగుతున్నారు. శాస్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు. ఇక కులం పేరుతో విద్యార్థినులను దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పలువురు సూచించారు. అయితే ఈ విషయంపై ఎవరి నుంచి ఫిర్యాదు రాలేదని ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపారు.

చీటి డబ్బులు ఇవ్వకుండా మోసం

శ్రీనిలయ చిట్‌ఫండ్‌పై కేసు నమోదు

సాక్షి,సిటీబ్యూరో: చిట్ డబ్బులు ఇవ్వకుండా ఒక చిట్‌ఫండ్ కంపెనీ మోసానికి పాల్పడిందంటూ రిటైర్డు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బోడుప్పల్‌కు చెందిన సత్యనారాయణ రిటైర్డ్ ఉద్యోగి. అతను లక్డీకపూల్‌లోని శ్రీనిలయ చిట్‌ఫండ్‌లో తన స్నేహితుల ద్వారా 40 నెలల కాల పరిమితితో రూ. 20 లక్షల చీటీ వేశాడు. ఈ ఏడాది జనవరిలో దానిని పాడడంతో రూ. 17.2 లక్షలు వచ్చాయి. ఆ డబ్బును చిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ బసవ శంకర్ రావు అడప, డైరెక్టర్లు రమేష్ అడప బాబు, రమాదేవి అడప, గీతా రమేష్ అడపలు నిర్ణీత సమయంలో ఇవ్వ లేదు. దీంతో సంస్థ ఎండీని నిలదీయగా తమకు కూడా రూ. 12 కోట్ల వరకు కస్టమర్ల ద్వారా రావాల్సి ఉందని, అవి వచ్చిన తర్వాత ఇస్తామని చెప్పారు. యాజమాన్యం 40 మంది వరకు చీటి డబ్బులను ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికే మూడు శాఖలను మూసేసిన సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కూడా మూసేస్తుందంటూ బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి


బీకేఎస్ సభ్యులతో గజేందర్‌గౌడ్

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్: రుణమాఫీ విషయంలో ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీకేఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో అనేక రైతు కుటుంబాలు ఒకే రేషన్ కార్డులో ఉన్నాయన్నారు. రుణమాఫీ విషయంలో రేషన్ కార్డు ప్రాతిపదిక కాదని ప్రభుత్వం ఓ పక్కన ప్రకటిస్తూ నిబంధనలు మాత్రం జారీ చేయకపోవడం శోచనీయమన్నారు. దీంతో చాలా మందికి రుణమాఫీ కాలేదన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం చట్టాన్ని అమలులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు కిసాన్ క్రెడిట్ అకౌంట్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసే విధంగా ప్రయత్నించాలన్నారు. బలరామ జయంతి సందర్భంగా ఈనెల 10న జిల్లా రైతు దినోత్సవాన్ని తుక్కుగూడలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి చంద్రయ్య, నాయకులు వెంకటరెడ్డి, భీమయ్య, సత్యం, పాండుగుప్తా, మల్లేశ్, రామస్వామిగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

విజయ డెయిరీ పాడి రైతుల ధర్నా

తలకొండపల్లి: పాల బిల్లులు చెల్లించాలని విజయ డెయిరీ పాడి రైతులు ధర్నా చేపట్టారు. రెండు నెలలుగా బిల్లులు రావడం లేదని, త్వరితగతిన చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని చంద్రధనలో సోమవారం బస్టాండ్ ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సుమారు 170 మంది రైతులు ప్రతి రోజు 2,000 లీటర్ల పాలను విజయ డెయిరీకి విక్రయిస్తున్నారన్నారు. కానీ రెండు నెలలుగా దాదాపు రూ.2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు చెల్లించకపోతే తమ కుటుంబ ఎలా గడుస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. విజయ డెయిరీ అధికారుల తీరును నిరసిస్తూ రోడ్డు పైన ఆవులను ఉంచి రాస్తారోకో చేపట్టారు. క్యాన్‌లలో ఉన్న పాలను ఒలకబోశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బక్కికుమార్ పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎంసీ(బ్రాంచ్ మిల్క్ సెంటర్)లోని ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని విజయ డెయిరీకి సూచించారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చంద్రధనలో ధర్నా చేస్తున్న పాడి రైతులు

లారీ ఢీకొని తమ్ముడి మృతి

అక్కకు తీవ్రగాయాలు

మేడ్చల్‌రూరల్: బైక్‌పై వెళుతున్న అక్క,తమ్ముళ్లను లారీ ఢీకొన్న ఘటనలో తమ్ముడు మృతి చెందగా, అక్క తీవ్రంగా గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మీసాల చిన్నయ్య కుటుంబం మేడ్చల్ పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ సమీపంలో నివాసం ఉంటూ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం చిన్నయ్య కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె నాగలక్ష్మి బైక్‌పై గుండ్లపోచంపల్లికి వెళుతుండగా పట్టణంలోని సీజన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచిలారీ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్, నాగలక్ష్మిలను స్థానికులు శ్రీకర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. నాగలక్ష్మి చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.